# అర్థ మొగుడు

తమ్ముడు రాసిన ఉత్తరాన్ని తనివి దీరా చదువుకుంది జాంబవతి మొహం మొగిలిపూవైంది.

"ఆ ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదువుతావు జాంబూ!" వెనక నుండి ఎప్పుడొచ్చాడో తెలీదు.... భర్త కృష్ణమూర్తి చేతులు నడుమును చుట్టేశాయి! తియ్యని పులకింత.

కోటీశ్వరుని కూతురు జాంజవతికీ, కేంద్రప్రభుత్వోద్యోగి కృష్ణమూర్తికీ మూడేళ్ళ క్రితం ముడి పడింది. రాఘవేంద్రనగర్ వీధిలోని అద్దింటిలో సెటిలైన ఆ చిలకా గోరింకలు అప్పుడే పిల్లా పీచు వద్దనుకున్నారు.

"మీకూ ఓ తమ్ముడుండి, అతగాడు ఢిల్లీలో జాబ్ చేస్తూ మీకో జాబురాస్తే తెలిసుండేది..." బుంగ మూతితో వెనక్కు తిరిగింది.

"అబ్బో... చిరుకోపం నీ అందాలను వందరెట్లు చేసిందోయ్!" సిగ్గుల బుగ్గల్ని పెదాలతో తడిపేశాడు. ఎవరన్నా చూస్తారేమోనని కష్టంగా ఉన్నా, అది ఇష్టంగానే ఉంది జాంబవతికి.

హఠాత్తుగా భర్త కళ్ళలోకి చూసింది. ఎప్పట్నుండో ఎదను తొలిచేస్తున్న స్త్రీ సహజమైన అనుమానం తళుక్కుమంది బుర్రలో.

"ఏమండీ.... మీకూ... వేరే అమ్మాయిల్తో పరిచయాలున్నాయా?" గోముగా అడిగింది.

"పరిచయాలా! ఎందుకుండవ్ ... చాలా ఉన్నాయి "

జారుడు బండమీంచి జారిపడినట్టన్పించిది.

"అమ్మో అమ్మో ఐతే నా కాపురం కోమటిచెరువై పోతుంది దేవుడోయ్..!" గుండెలు బాదుకుంది మొహం కందిపోయింది

"పరిచయాలంటే మామూలు పరిచయాలే జాంబూ!" ప్రణయం ప్రళయంగా మారకముందే చల్లగా జారుకోవడం క్షేమ మన్పించింది.

"సరే. . నేను ఆఫీసుకెళ్ళున్నా తలుపేసుకో!" వెనక్కి తిరిగి చుడకుండా వెళ్ళిపోయాడు

"మా శ్రీవారు అపర శ్రీరాముడనుకున్నానే .!" సోఫాలో కూలబడింది అరచేతులు గడ్డానికతుక్కు పోయినై బుర్రనిండా చింపిరి ఆలోచనలు, చిల్లెర ఊహలు.

ఎదురుగా గోడకు వేళ్ళాడ్తున్న శ్రీకృష్ణ రాసలీస పటం పిచ్చెకింస్తూంది

"రాఘవేంద్రనగర్...ఘర్ నెంబర్ సోలా...యహీహైనా... ఇదేనా?" అందాల బరిణ ఒకతి నేరుగా ఇంట్లో కొచ్చేసింది.

అపిల్ పండు దేహఛాయ, గుండ్రని మొహం, చెంపలకు చారెడెసి కళ్ళు.. రెండు కలువల మధ్య నిండుగా ఉదయిస్తున్న బాలార్కుడిలా, రెండు కళ్ల మద్య ఎర్రని కుంకుమ బొట్టు... మంచి అందగత్తె.

జాంబవతి మనసు కల్లుదాగిన కోతైంది.

"అనుకుంటున్నా... ఎవతో కొంపమీది కొస్తుందని. .. వచ్చావా... దా, నీ కాళ్ళిరగొడ్తా.... ఎవతివే నువ్వు?"

"మేరా నామ్... నా పేరు....!" చెప్పబోయింది.

"ఏపేరైతేనేం? మా వారిని బుట్టలో వేసుకుంది గాక ఇంటి మీదికి రావాల్నా? వెళ్ళెళ్లు!"

"అబ్బే .... నేనూ... మీ...." అందాల బరిణ అయోమయం.

"నాకింకేమీ చెప్పొద్దు, పో గెటౌట్ బద్మాష్!" దిగ్గున లేచి గొంతు చించుకుంది.

గుండెలెగిసి పడుతున్నై కళ్ళు చెమ్మగిల్లినై ఆ అమ్మాయి వెళ్ళిపోయింది.

హమ్మో మొగబుద్ధి మొరటు బుద్ధి అంటే ఏమితో అనుకున్నా మళ్ళీ సోఫాలోకి జారుకుంది

ఎందుకైనా మంచిది, తలుపులు వేద్దామని లేచి ముందుకు కదిలింది తుమ్మమొద్దులా గున్నాడెవడో మొహం బొగ్గు ముద్దలాగుంది తెరిస్తే గాని నోరెక్కడుందో తెలిసేట్టులేదు లోపలికొచ్చేస్తున్నాడు మొదట భయమేసింది. ఆ తర్వాత దైన్యం ధైర్యంగా మారింది

"ఎవర్రా రౌడి వెధవా!" ఒక్క తన్ను తన్నింది. కాలేజీలో నేర్చుకున్న కరాటే ఇప్పుడు పనికొచ్చింది. తలుపులు వేసొచ్చి టీ వి ముందు కూచుంది. అల్లకల్లోలమైన అంతరంగానికి తెలుగు ప్రోగ్రాం రుచించలేదు. టక్కున టీ.వి. ఆపేసింది. ఎవరో తలుపు తడుతున్నారు ఐతే మళ్ళీ వాడే వచ్చుంటాడు వెధవ! నా తడాకా చూపించాలి గబగబా వెళ్ళి తులుపుతీసింది. గల్లా బట్టి లోపలికిలాక్కొచ్చింది. గుద్దు గుద్దాలని చెయ్యెత్తింది. అతడు ... వాడు కాదు.

"ఇదేంది జాంబూ! నేను ... నీ మొగుణ్ణి" సింహం చేతిలో చిట్టెలుకలా వణికి పోతున్నాడు కృష్ణమూర్తి.

జాంబవతి గుండె జారింది. గల్లా వదిలేసి మంగళ సూత్రాలు కళ్లకందుకుంది. చేతులు పట్టుకుని, "అయ్యో... అదేమిటండీ, మీ మొహం నిండా రంగు... డ్రెస్సునిండా....!" బేజారైపోతుంది.

"ఈ రోజు హోలీ కదా! మాకు సెలవు లేదాయె. అఫీసుకెల్తాంటే... ఇదీ గతి! ఐనా.. నువ్వీ రోజు అపరకాళీవైపోయావేమిటీ?" గాలికి కొట్టుకుపోతున్న గడ్డిపోచలా వెళ్ళి సోఫాలో కూలబడ్డాడు.

"అయ్యయ్యో . పోయపాటై పోయిందండీ " బతిమాలింది కృష్ణమూర్తి కూలై పోయాడు జాంబవతి కప్పుడు గుర్తుకొచ్చింది

"అరెరే.. మా తమ్ముడూ, మరదలూ ఈరోజే వస్తాడని రాశాడు గదండీ. ఇక్కడెవరికీ తెలికుండా వాడా హర్యానా అమ్మాయిని ప్రేమించి పెళ్లిచేసుకున్నాక మనమే రమ్మని రాశాం గదా! వాళ్ళొట్లోస్తారో! ఈ రంగుల పండుగ ఏంజేస్తుందో !"

"అనుమానం ముందుబుట్టి ఆడది తర్వాత పుట్టిందని అందుకే అన్నారేమో! మీ తమ్ముడూ, మరదలు వచ్చేశారు. నీ దెబ్బకు బయటపడున్నారు పోయి చూస్కోపో...!"

బయటికెళ్లి తుమ్మమొద్దనూ, అందాల బరిణనూ తీసుకొచ్చింది.

"ఈ రోజు హోళీ అని మరిచాంరా మధూ! కొత్త పెళ్ళికూతుర్నికూడా తరిమేశాంరా!" తమ్ముని చేతులు పట్టుకుంది

ఢిల్లీ జంట గుండెలనిండా ఊపిరి పీల్చుకుంది.

"పోనీలే అక్కా.... మా బావగారు రాకపోతే బైకారైపోయేది!"

"నమస్తేజీ... మెరానామ్ రాధాబాయి. మీ మరదల్ని. తెలుగు కొద్దిగా తెలుసు. ఢిల్లీలో తెలుగు గల్లీలో ఉన్నాం...!" అందాల బరిణ చేతులు జోడించిది.

"ఛీ పాడుపని చేశానమ్మా... పొరపాటైంది మరదలా" చేతులు చాచింది.

"అదేం కాదు, మీరు వేరీ ఆడబిడ్డగదా! అర్ధమొగుడనిపించుకున్నారు." ఆడబిడ్డ ఒడిలో ఒదిగి పోయింది

నవ్వుల పూలజల్లు కురిసింది వెల్లువైపారింది.

(అమృత్ కిరణ్ - 1-4-1995)